


జాతీయ జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్


ప్రసంగిస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

ప్రజాపాలనలో..
సబ్బండ వర్గాల సంక్షేమం

- జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రజాపాలన దినోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడిన తర్వాత సబ్బండవర్గాలు సంతోషంగా ఉన్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. ఉద్యమాల స్ఫూర్తితో రాబోయే కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. భారతదేశంలో తెలంగాణలో ప్రధానమైన అస్థిత్వం ఉందని, ఇక్కడి నాగరికత ఎంతో ప్రత్యేకమైనదని ఆయన అన్నారు. దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి తమ హక్కులను సాధించుకున్న ఘనత తెలంగాణ ప్రజానీకానిదని ఆయన తెలిపారు. తెలంగాణ అస్థిత్వ పోరాటాన్ని దారి మళ్లించేందుకు అనేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి 48 గంటల్లోనే మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాలను అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మహాలక్ష్మీ పథకం కింద నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇప్పటి వరకు 6కోట్ల 80లక్షల 70వేల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. దీని కారణంగా దాదాపు 310కోట్ల 43లక్షల రూపాయలు మహిళలు ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల్లో దళారుల ప్రమేయం అధికంగా ఉండేదని డబుల్ బెడ్రూంల పేరిట దాదాపు పదేళ్ల కాలయాపన చేసిన విషయం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల 586దరఖాస్తులు రాగా అర్హతను బట్టి 11వేల 622ఇళ్లను కేటాయించామని, వీటిలో 6వేల 599ఇళ్లకు మార్కింగ్ వేశామని తెలిపారు. వీటిలో 3వేల 465 ఇళ్ల బేస్‌మెంట్ లెవల్లో నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

తెలంగాణ రైతాంగం దేశానికే ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 3 లక్షల 6వేల మంది రైతుల ఖాతాల్లో 46 కోట్ల 640లక్షల రూపాయలు జమ చేశామన్నారు. ఉద్యానవన పంటలకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలు పాల్గొన్నారు.


ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గొర్తి వరిపైనే ఆశలు

- గట్టు మండలంలో అధిక విస్తీర్ణంలో సాగు
- సమృద్ధిగా వర్షాలతో దిగుబడిపై రెట్టింపు ఆశలు
- నడిగడ్డలో ధర్మపంటగా గొర్తి వరికి పేరు
- కళకళలాడుతున్న పైరు



గట్టు మండలం రాయపురం శివారులో సాగు చేసిన గొర్తివరి పైరు

6

శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో వేగంగా మరమ్మతులు

- నాలుగో యూనిట్‌లో రోటార్ బిగింపు
- వచ్చేనెల మొదటి వారానికి పూర్తి చేసేందుకు కసరత్తు

7


శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నాలుగో యూనిట్‌లో చేపడుతున్న స్టేటర్‌లో రోటార్ బిగింపు పనులు

దిగుబడి దక్కేనా?

- అధిక వర్షాలతో నాశనమైన పత్తి పంటలు
- యూరియా అందక తగ్గనున్న వరి దిగుబడి
- నానో యూరియాపై అవగాహన కల్పించని అధికారులు


తాడూరు సమీపంలో గిడసబారిన పత్తి పైరు, (ఇన్‌సెట్లో) చెట్టుకే నల్లగా మారిన పత్తి (ఫైల్)

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు మొక్కజొన్న, వరి పంటలు మినహా అన్ని పంటలను నాశనం చేశాయి. ఈ సీజన్‌లో జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 47.4శాతం వర్షపాతం కురిసింది. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన అధిక వర్షపాతం కారణంగా పంటలకు చీడపీడల బాధ అధికమైంది. జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగైన పత్తి, వరి సాగుచేశారు. పత్తి పంటకు సహజంగానే నష్టం వాటిల్లింది. సాధారణంగా పత్తి ఎకరాకు 10 నుంచి 15క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 2-5 క్వింటాళ్లు మాత్రమే వచ్చే పరిస్థితి నెలకొంది. అధిక వర్షాల కారణంగా గూడ, పూత రాలుతుండడంతో పత్తి అధికంగా సాగు చేసిన తాడూరు, తెలకపల్లి, అమ్రాబాద్, పదర, తిమ్మాజిపేట, బిజినేపల్లి మండలాల రైతులు నిరాశలో ఉన్నారు. వరి సాగు చేసిన రైతుల్లో కూడా ఈసారి ఆందోళనకరమైన పరిస్థితి నెలకొంది. నాట్లు వేసి దాదాపు నెల 15రోజులు కావస్తున్నా రైతులకు సరిపడా యూరియా దొరకకపోవడం మూలంగా పంట ఎదుగుదల లేక దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా ఎకరాకు 25-30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా యూరియా కొరత కారణంగా 10-15 క్వింటాళ్లు వస్తే ఎక్కువ అని వాపోతున్నారు. ఎకరా వరి సాగుచేస్తే రూ.30 నుంచి రూ.40వేల దాకా ఖర్చవుతుంది. ప్రస్తుతం పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడం మూలంగా వరి పంటకు వాతావరణం సహకరించినప్పటికీ యూరియా కొరతతో దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. నానో యూరియా అందుబాటులో ఉన్నా అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో రైతులు అటువైపు చూడటం లేదు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యపర్చాల్సిన అధికారులు అచేతనంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


మేడిపూర్ గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన వరి పంట

అధిక వర్షాలతో రాలుతున్న పూత, పిందె



ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో తేమ శాతం ఎక్కువై పత్తిలో గూడా, పూత, పిందె రాలిపోయింది. వరి పంటలో సైతం వరి నాట్లు వేసి రెండు నెలల సమయం కావస్తున్నా యూరియా వేయకపోవడంతో ఎదుగుదల లేక దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. దీని కారణంగా రైతు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

- జానకిరాంరెడ్డి, ఖిలాన్‌పల్లి, తాడూరు

దగ్గర్లో పరీక్ష.. మాకెందుకీ శిక్ష

టీచర్ల కోసం రోడ్డెక్కి నినదించిన విద్యార్థులు

తల్లిదండ్రులతో కలిసి అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయింపు

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని బొంకూరు పాఠశాలకు టీచర్లు కావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. దీంతో విసుగు చెందిన విద్యార్థులు బుధవారం అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించారు. కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చేదాకా కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనాల శీర్షికలను పట్టుకొని నిరసన తెలిపారు. పంతుళ్లు రాక.. పాఠాలు జరగక, దగ్గర్లో పరీక్ష.. మాకెందుకీ శిక్ష, మాకు ఓటు లేకపాయే.. మీకు దయ రాకపాయే అంటూ నినాదాలు చేశారు. అన్ని వసతులతో పాటు ఉత్తీర్ణత శాతం బాగుందని ఇక్కడకు వస్తే కనీసం టీచర్లు లేకపోతే ఏం చదవాలని విద్యార్థులు వాపోయారు. ఇప్పటికే ఎస్‌ఏ-1 పరీక్షలు పూర్తయ్యాయని, ఎస్‌ఏ-2,3 పరీక్షల్లో ఏం రాయలని ప్రశ్నించారు. కలెక్టరు ఆదేశాలు కూడా అమలు కాకపోతే పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇప్పటికైనా స్పందించకపోతే కలెక్టరు వద్దకే పాదయాత్రగా వెళ్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో అక్కడకు చేరుకొని వెంటనే ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఇదే సమయంలో డీఈఓ అబ్దుల్‌ఘనీ ఎంఈఓకు కాల్ చేసి ఉండవల్లి నుంచి ఇదరు ఉపాధ్యాయులను వెంటనే అక్కడికి పంపించాలని ఆదేశించారు. కానీ ఇక్కడకు వచ్చేందుకు ఇష్టం లేక ఒకరు ఆఫ్‌లీవ్ పెట్టి వెళిపోగా.. మరొకరు వచ్చిన రిజిస్టార్‌లో సంతకం చేయనని భీష్మించడం కొసమెరుపు. ఇలా అయితే చదువు ఎలాఅని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.


ప్లకార్డులతో అంతర్రాష్ట్ర రహదారిపై బైఠాయించిన హైస్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



టెట్.. టెన్షన్

- ఉపాధ్యాయులు రెండేళ్ల వ్యవధిలో టెట్ అర్హత సాధించాలన్న సుప్రీం
- తీర్పును పునఃసమీక్షించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- 2010 నోటిఫికేషన్ కంటే ముందు నియామకం అయిన వారికి మినహాయింపు ఇవ్వాలనే వాదన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలంటున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. దేశ ఉన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుతో టీచర్లు ఉలిక్కి పడ్డారు. ఐదేళ్ల పైబడి సర్వీస్ ఉన్న ఇన్ సర్వీస్‌లో గల ఉపాధ్యాయులు రెండేళ్ల లోపు టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు) అర్హత పరీక్షరాసి ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగం వదులుకోవాల్సిందేనని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ఈ నిర్ణయం అన్యాయమని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

2010లో నోటిఫికేషన్

టెట్ అర్హత పరీక్షకు సంబంధించి 2010 ఆగస్టు 23న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీఈటీ) కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో జారీలో ముందు పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఈ పరీక్ష నుంచి (మిగతా 6లో..)



షాషాబ్ గుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఉమ్మడి జిల్లాలో 6,392 మంది ఉపాధ్యాయులు

ఉమ్మడి పాలమూరు జిల్లాకు 15,080 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉండగా, 6,392 మంది విధులు నిర్వహిస్తున్నారు. అందులో గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పీఎస్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు ఉన్నారు. కోర్టు తీర్పు ప్రకారం వీరంతా రెండేళ్ల లోపు టెట్ అర్హత సాధించాల్సి ఉంటుంది.

పునఃసమీక్షించాలి

ఉపాధ్యాయులు రెండేళ్ల లోపు టెట్‌లో అర్హత సాధించాలని, లేదంటే ఉద్యోగాలను వదులుకోవాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలి. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులో పిల్ వేయాలి.

- వెంకటేష్, టీఎస్ యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

కుటుంబ పోషణ భారం

- ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- 9 నెలలుగా మంజూరు కాని గుడ్ల బిల్లులు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 6 వేల మంది కార్మికులు


అమరచింత పాఠశాలలో వంట పనిలో నిమగ్నమైన మధ్యాహ్న భోజన కార్మికులు

7





ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న లారీ, ఇద్దరి మృతి

వనపర్తి రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన వనపర్తి జిల్లా నాచహళ్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకున్నది. అదే గ్రామానికి చెందిన రవి(42), సరోజ దంపతులు పెత్తర అమావాస్యను పురస్కరించుకొని వరుసకు బావమరిది అయిన వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టలో నివాసం ఉంటున్న రాజు(44)ను తమ స్వగ్రామానికి పిలిపించుకున్నారు. రవి, రాజు కలిసి తన సొంత ఆటోలో పెబ్బేరుకు వెళ్లి ఒక గొర్రెపిల్లను తీసుకొని వచ్చారు. అది పెద్దదిగా ఉండటంతో తిరిగి ఇవ్వడానికి రవి, ఆయన భార్య సరోజ, రాజు కలిసి అదే ఆటోలో పెబ్బేరుకు బయలుదేరారు. గ్రామం దాటుతుండగానే వారు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొన డంతో రాజు, రవి అక్కడికక్కడే మృతి చెందారు. రవి భార్య సరోజకు తీవ్ర గాయాలయ్యాయి. సరోజను, మృతదేహాలను జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు.


మృతి చెందిన రవి (ఫైల్)


మృతి చెందిన రాజు (ఫైల్)



ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



డీసీసీబీలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

పాలమూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో సెప్టెంబరు 17వ తేదీని పురస్కరించుకొని చైర్మన్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, టీజీ ఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో ఎస్‌ఈ పి.వెంకట రమేష్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సెప్టెంబరు 17వ తేదీ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- నాలుగు గేట్లు ఎత్తి 1.11 లక్షల క్యూసెక్కులు విడుదల

గద్వాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం 1.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. దీంతో ప్రాజెక్టు నాలుగు గేట్లను తెరిచి 1,11,016 క్యూసెక్కులను కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,060 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 211.47 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్ ఫ్లో 1.60 లక్షల క్యూసెక్కులు జూరాలకు వస్తోంది. ప్రస్తుతం జూరాలకు 1.73 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 20 గేట్లను ఎత్తి 1.42 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 34,879 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 27 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

700 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు: జూరాల ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి 700 మిలియన్ యూనిట్లకు చేరిందని ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో కారు యూనిట్ల ద్వారా గడిచిన 24 గంటల్లో 4.074 మిలియన్ చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 338.100 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు.

అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా గడిచిన 24 గంటల్లో 3.821 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా ఇప్పటివరకు 362.935 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు తెలిపారు. అలాగే ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాన్ని దాటి 90 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డ్ స్థాయిలో జల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో
నాణ్యమైన దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

బిజినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చని రావేఫ్ విద్యార్థులు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లో బుధవారం గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా వనపర్తి వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

దీంతో పాటు వివిధ పంటలకు ఆశించే చీడ పీడల నివారణకు అవసరమైన నివారణ ద్రావణాలను తయారు చేసుకునే పద్ధతులను ప్రత్యేకంగా చేసి చూపించారు. సేంద్రియ పద్ధతుల్లో రైతులకు ఆర్థిక భారం తగ్గడంతో పాటు ఆరోగ్యవంతమైన ఆహార పంటల ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. విద్యార్థినులు కీర్తి, మానస, స్వాతి, మంజుల, శ్రీజ, పూజిత, అంకిత ఉన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పెంట్లవెల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెంట్లవెల్లి మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని బుధవారం మహిళలు ట్యాంకు దగ్గర ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సరిగా రాకపోగా, పక్కన ఉన్న కృష్ణానది నీటిని తెచ్చుకొని తాగుతున్నామని వాపోయారు. దాదాపు నాలుగు నెలలుగా సమస్య ఉన్నా, పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగడం వల్ల రోగాలు వస్తున్నాయన్నారు. వర్షాకాలంలోనే నీరు సక్రమంగా రాకుంటే ఎలా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి మా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు. మహిళలు చిట్టెమ్మ, బొజ్జమ్మ, శాంతమ్మ, సరస్వతి, సుజాత, తిరుపతయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

మా డబ్బులు ఇప్పించండి


- ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి విన్నవించిన మహిళలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొదుపు డబ్బును బ్యాంకులో జమ చేయకుండా కాజేసిన రూ.28 లక్షలు మాకు తిరిగి ఇప్పించాలని పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని రాంపూర్ మహిళలు విన్నవించారు. ఇందులో అక్రమాలకు పాల్పడిన బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం నారాయణపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పర్ణికారెడ్డిని మహిళా సంఘాల మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రాంపూర్ గ్రామంలోని గోల్డెన్ శ్రీవిష్ణు, వెన్నెల తాజ్మహల్, సూర్యలక్ష్మి ఆదర్శ, మహిళా సంఘాలు గ్రూపులుగా ఏర్పడి ఎస్‌బీఐ మహబూబ్‌నగర్ బ్రాంచిలో రుణం తీసుకున్నామని మహిళలు తెలిపారు. రుణానికి సంబంధించి ప్రతీ నెల చెల్లించే వాయిదా డబ్బులు గ్రామ బుక్ కీపర్ వరలక్ష్మికి అందించామని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ డబ్బులు రూ.28 లక్షలు వరలక్ష్మి తన సొంత అవసరాలకు వాడుకున్నదన్నారు. మహిళా సంఘాలందరం బ్యాంకుకు వెళ్లగా మీ డబ్బులు బ్యాంకులో జమకాలేదని తెలుపగా, కలెక్టర్‌కు మే 18న ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఏ అధికారులు గ్రామంలోకి వచ్చి విచారించి రికవరీ చేయాలన్నా ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయారు. కూలీ పనిచేసి తాము ఇచ్చిన డబ్బు వాడుకొని తమను బుక్‌కీపర్ అన్యాయం చేసిందని మహిళలు బోరున విలపించారు. ఎమ్మెల్యే మహిళలతో పాటు నేలపై కూర్చొని జరిగిన అన్యాయం తెలుసుకున్నారు. ఈ సంఘటనపై కోయిల్‌కొండ ఎస్‌ఐ తిరుపాజితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి మహిళలకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గొర్త వరిపైనే ఆశలు



గట్టు శివారులో సాగు చేసిన గొర్తవరి పొలం

- గట్టులో భారీగా సాగు
- సమృద్ధిగా వర్షాలతో రెట్టింపు ఆశలు
- నడిగడ్డలో ధర్మపంటగా గొర్త వరికి పేరు
- కళకళలాడుతున్న పంటలు

గట్టు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గొర్త వరి సాగుపై మండల రైతాంగం కొండంత ఆశలు పెట్టుకున్నారు. మండలంలో గొర్త వరిసాగు (గొర్తమడులు) పొలాలు అధికంగా ఉండటంతో ఇక్కడి రైతాంగం గొర్తవరి సాగును అధికంగా సాగు చేస్తారు. నడిగడ్డ ప్రాంతంలో ఈ గొర్త వరి సాగును ధర్మపంటగా పిలుస్తారు. గొర్తవరిని అస్మాన్‌తరి(ఆకాశం నుంచి జాలువారిన చినుకులకు పండే పంటగా) పిలుస్తారు. ఈ విధంగా పండే పొలాలు నడిగడ్డలో అధికంగా ఉన్నాయి.

ఉమ్మడి గట్టు మండలంలో దాదాపు వేల ఎకరాల వరకు గొర్త మడులు ఉండేవి. రిజార్వాయర్ల నిర్మాణంతో పాటు కాలువల తవ్వకాల్లో చాలామటుకు గొర్తపడెలు ముంపునకు గురి కావడంతో గొర్త పండె పొలాల విస్తీర్ణం తగ్గింది. ఈ తరహా పంట గట్టు తప్ప మరెక్కడా పండించరు.

● గొర్త వరి సాగు విధానం ఇలా...

గొర్తవరిని జూన్, జూలై మాసాల్లో వర్షాధారంగా విత్తుకుంటారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత కురిసిన వర్షాలకు గొర్రు అనే సదనంతో వడ్లను విత్తుతారు. నెల రోజుల తర్వాత దెంతె అనే పరికరంతో వరిసాళ్ల మధ్య కలుపును తొలగించే పనులు చేపడుతారు. ఆగస్టు నాటికి వర్షాలు ఆశించిన స్థాయిలో బాగా కురిసిన పిదప గొర్తమడులలో ఊట నీరు చేరుతాయి. అప్పుడు మరో మారు దెంతెలు పడుతారు. సాళ్ల మధ్య మిగిలిపోయిన కలుపును కూలీల సహాయంతో తొలగిస్తారు. ఇలా మూడు నెలల తర్వాత ఊట నీటితోనే వరి పంట కోతకు వస్తుంది. 90 నుంచి 100 రోజుల వ్యవధిలోనే గొర్త వరి పంట కోతకు వస్తుంది. తక్కువ పెట్టుబడి రసాయనిక ఎరువుల వాడకం లేకుండానే కేవలం సేంద్రియ ఎరువులు రెండేళ్లకో సారి వాడుతూ రైతులు ఎకరాకు 20 నుంచి 28 బస్తాల దాకా గొర్తవరిని పండిస్తారు. ఇలా పండిన ధాన్యం సంవత్సరం వరకు తిండిగింజలుగా నిల్వ ఉంచుకుంటారు.

● సమృద్ధిగా వర్షాలు.. చిగురిస్తున్న ఆశలు..

తొలకరి వర్షాలు పలకరింపుతో పులకించిన రైతులు కొందరు ముందుగానే విత్తనాలను వేసుకున్నారు. ప్రస్తుతం వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురియడంతో రైతులు గొర్త వరిపై గంపెడంత ఆశలు నింపుకున్నారు. మండలంలోని గొర్త మడులలో కురిసిన వర్షాలకు భారీగా ఊట నీరు చేరుతుండటంతో గొర్త పడెలు కళకళ లాడుతున్నాయి. దీంతో రైతుల ఆశలు రెట్టింపు అవుతున్నాయి. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో కుంటలలో, చెరువులలో నీరు చేరాయి. వీటి ద్వారా కూడా ఊటలు పెరిగి గొర్తవరికి నీరు సమృద్ధిగా అందుతున్నది. దీంతో గొర్తవరి గట్టు రైతులను గట్టేకిస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు.

● మంచి దిగుబడులు వచ్చే అవకాశం



ఈసారి కురుస్తున్న వర్షాలకు గొర్త వరి పంటలు కళకళలాడుతున్నాయి. గొర్తవరి పండే పొలాలు గట్టులో ఉన్నాయి. మన వరికి గొర్త వరి సాగుకు తేడా ఉంటుంది. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా పంటలను సాగు చేస్తారు. ఈసారి సమృద్ధిగా వర్షాలు కురియడంతో గొర్తమడులలో భారీగా ఊట నీరు చేరింది. అధిక దిగుబడులు పొందడానికి అవకాశాలు ఉన్నాయి.

\- హన్మంతురెడ్డి, మండల వ్యవసాయ అధికారి

అచ్చంపేటకు గులాబీ జెండాను తెచ్చిందే నేను

- పేదవాడి వాయిస్ వినిపించొద్దని నాపై కుట్ర చేశారు..
- ధర్మం, సామాజిక న్యాయం కోసం పోరాడే కాషాయ జెండాను పట్టాను
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): "అచ్చంపేటకు గులాబీ జెండాను తెచ్చిందే నేను" అని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బీజేపీలో చేరిన తర్వాత మొదటిసారిగా బుధవారం అచ్చంపేటకు వచ్చిన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు అడుగడుగునా స్వాగతం పలికారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి, జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, సీనియర్ నాయకులు సోలంకి శ్రీను, కట్టా సుధాకర్ రెడ్డి, బల్మూరు జానకిలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గువ్వల బాలరాజు మాట్లాడారు. అచ్చంపేట ప్రాంతంలో గులాబీ జెండా నిలిపింది గువ్వల బాలరాజేనని అన్నారు. ప్రతీ గ్రామంలో నాయకత్వాన్ని తయారు చేసి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందానని అన్నారు. పేదవాడి వాయిస్ వినిపించొద్దని గులాబీ పార్టీలోనే నాపై కుట్ర జరిగినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అందుకే పార్టీని వీడి దేశ రక్షణ కోసం ధర్మం కోసం సామాజిక న్యాయం కోసం పేదల అభ్యున్నతి కోసం పనిచేసే కాషాయ జెండాను ఎత్తానన్నారు.

ఈనెల 28న కేటీఆర్ వస్తున్నారని, అచ్చంపేటకు ఎందుకు వస్తున్నారో నల్లమల ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఓడించిన ఘనత వారిదని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వారు అబద్ధపు 420 హామీలతో గద్దెనెక్కారని బీజేపీ సీనియర్ నాయకుడు అచారి అన్నారు. గువ్వల బాలరాజును గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో అచ్చంపేటలో గులాబీ జెండాను ఎగరవేస్తామని అందుకు కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య కాస్త ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు ఇరువురు నాయకులను చెల్లాచెదరం చేశారు. మండల అధ్యక్షురాలు జ్యోతి, బీజేపీ నాయకులు మాంగ్యానాయక్, బాలాజీ, గంగిశెట్టి నాగరాజు, పొకలకారు రామోజీ, రేణయ్య, శంకర్ మాదిగ, పర్వతాలు, మనోహర్, శివచంద్ర, చందులాల్ చౌహాన్ పాల్గొన్నారు.

పనులు గడువులోగా పూర్తి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం వంగూరు మండలంలోని సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిని కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో విద్యుదీకరణ, సోలార్ గ్రామం ప్రణాళిక, పలు అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి స్థానిక, సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. సమీక్ష సమావేశంలో కలెక్టర్ అధికారులతో శాఖల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై తరచూ మానిటరింగ్ నిర్వహించి లోపాలను సరిదిద్దాలన్నారు. చిల్డ్రన్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు, యూనియన్ బ్యాంక్, పోస్టాఫీస్, ప్రాథమికోన్నత పాఠశాల అదనపు భవనాలు, విద్యుదీకరణ వంటి అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అన్ని వసతులతో రూపుదిద్దుకోవాలన్నారు. గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కొండారెడ్డిపల్లిని వంద శాతం సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దాలని, ఆ దిశగా తక్షణ చర్యలు చేపట్టాని రెడ్కో అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చేలా కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులు జరగాలన్నారు. అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో, ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

టెట్.. టెన్షన్



విద్యార్థులకు పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

(5వ పేజీ తరువాయి)

మినహాయింపు ఇచ్చింది.

రెండేళ్ల గడువుతో ఆందోళన

రెండేళ్ల గడువులో టెట్‌లో అర్హత సాధించాలన్న సుప్రీం కోర్టు తీర్పు ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పాఠాలు బోధిస్తున్నారు. వయస్సు, ఆరోగ్య సమస్యలు, ఇంటి బాధ్యతలు వంటి కారణాలతో మళ్లీ చదివి, పరీక్షకు సిద్ధం కావడం చాలా కష్టమని అలాంటి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి లక్షలాది మంది టెట్ పరీక్షకు హాజరు కావాల్సి వస్తే నిర్వహణ సమస్యలు ఎదురవుతాయని విద్యావేత్తలు అంటున్నారు. ఉపాధ్యాయులు టెట్ వద్దని, తీర్పును సుప్రీం కోర్టు పునఃసమీక్షించాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు అంటున్నారు. 2010 నోటిఫికేషన్ కంటే ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలనే వాదన వినిపిస్తోంది. విద్యారంగంలో అనుభవమే గొప్ప అర్హత అని, సీనియర్ టీచర్ల బోధన నైపుణ్యాలను కేవలం టెట్ పరీక్షతో కొలవలేమని అంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం

సుప్రీం కోర్టు తీర్పుపై ప్రభుత్వాలు పునఃసమీక్షించాలి. దీని వల్ల చాలా మంది సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఈ నిర్ణయం విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, న్యాయ నిపుణులతో సంప్రదించి ఉపాధ్యాయులకు మేలు కలిగేలా నిర్ణయం తీసుకోవాలి.

\- మదన్‌మోహన్ యాదవ్, టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

అతిథి అధ్యాపక పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి 2025-2026 సంవత్సరానికి గాను హిస్టరీ, కామర్స్, బోటనీ, తెలుగు, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల కోసం ఈనెల 19లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఇతరులకు కనీసం 55 శాతం మార్కులు ఉండి పీహెచ్‌డీ నెట్, సెట్ ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వీరికి ఈనెల 20న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీఏ అధికారుల తనిఖీలు

- 21కేసులు నమోదు

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణ శాఖ అధికారులు వాహనాలపై నజర్ పెట్టారు. బుధవారం జిల్లాలో వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు ఆర్టీఐ టీవీరావు తెలిపారు. అలంపూరు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు చేశారు. ఇందులో మొత్తం 21 కేసులు నమోదు చేశామని, పలు ప్రైవేటు స్కూల్ బస్సులు కూడా ఉన్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎంవీఐ రాములు, ఏఎంవీఐ సైదా, మరో ఆరుగురు విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో
బొంకూరు విద్యార్థి ప్రతిభ

- స్వర్ణ పతకం సాధించిన కళ్యాణ్‌కృష్ణ



విద్యార్థిని సన్మానిస్తున్న బొంకూరు గ్రామ పెద్దలు. పంచాయతీ సెక్రటరీ రజియాబేగం

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని బొంకూరుకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. గ్రామానికి చెందిన అశోక్, రాణి దంపతుల కుమారుడు టి.కళ్యాణ్ కృష్ణ కర్నూలులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. అతడు నేపాల్ దేశంలో జూలై 24 నుంచి 28 వరకు జరిగిన అండర్-14 అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా బొంకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి రజియబేగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచు శ్రీలత భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు రాధమ్మ, భరత్‌రెడ్డి, రాంభుపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి
ఎరువుల విక్రయాల నిలిపివేత

నవాబ్‌పేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండల కేంద్రంలో ఉన్న కొరమాండల్ బ్రాంచ్‌లో గురువారం నుంచి నెలరోజుల పాటు ఎలాంటి ఎరువులు విక్రయించరాదని జడ్చర్ల అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ గోపినాథ్ బుధవారం తెలిపారు. ఈనెల 15న కొరమాండల్ బ్రాంచ్‌కు 300ల బ్యాగుల యూరియా పంపించగా అందులో పనిచేస్తున్న లైసెన్సు హోల్డర్‌గా వ్యవహరిస్తున్న మధు శేఖర్ తనకు అనుకూలమున్న వ్యక్తులకు ఇచ్చినట్లు తెలిపారు. టోకెన్ ఇచ్చిన రైతులకు ఇవ్వకపోవడంతో రైతులు మహబూబ్‌నగర్ రహదారిపై బైఠాయించారన్నారు. ఆందోళనతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని ఏవో క్రిష్ణకిషోర్ ఫిర్యాదు చేశారన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు

హన్వాడ/నవాబ్‌పేట , సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు రెండు గంటల పాటు హన్వాడలో రాస్తారోకో చేశారు. బుధవారం 9 గంటల ప్రాంతంలో యూరియా కోసం అన్నదాతలు సొసైటీ వద్ద వచ్చారు. అయితే యూరియా ఈ రోజు రాదని చెప్పడంతో ఒక్కసారిగా రైతులు తాండూర్-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ మండల నాయకులు కొండ లక్ష్మయ్య, బాలరాజు, చెన్నయ్య, యాదయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, జంబులయ్యతో పాటు నాయకులు పాల్గొని రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులను లేపేందుకు ప్రయత్నం చేస్తున్న సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. రైతులకు ఎంత చెప్పినా వినలేదు. కొద్దిసేపు పోలీసులు వారితో మాట్లాడారు. అయినా వినలేదు. చివరికి రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులతో ఎస్ఐ వెంకటేష్ మాట్లాడి యూరియా వచ్చేవిధంగా పైఅధికారులతో మాట్లాడుతానని చెప్పి రాస్తారోకోను విరమింపచేశారు. దాదాపుగా రెండు వైపులా కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.



నవాబ్‌పేటలో యూరియా టోకెన్ల కోసం బారులు తీరిన అన్నదాతలు

● నవాబ్‌పేట మండల కేంద్రానికి యూరియా వస్తున్న విషయం తెలుసుకున్న రైతులు టోకెన్ల కోసం బుధవారం రైతు వేదికల వద్ద గంటల తరబడి నిలిచి ఉన్నారు. రెండు లారీలు రావడంతో వాటి కోసం అధికారులు టోకెన్‌లు జారీ చేశారు. అయితే కొందరు రైతులు అధికారులు వారికి అనుకూలం ఉన్నవారికి టోకెన్లు ఇస్తున్నారని ఆందోళన చేస్తూ ఏవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య


ఈరమ్మ (ఫైల్)

కేటీదొడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల తండాలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమిత్యాల తండాకు చెందిన ఈరమ్మ (19)కు 4 నెలల క్రితం మల్దకల్ మండలం మద్దెలబండ తండాకు చెందిన నారాయణనాయక్‌తో పెళ్లి నిశ్చయమైంది. అప్పటి నుంచి వారిద్దరూ తరుచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. మంగళవారం ఆమె తల్లి దేవమ్మ పనిమీద బయటకు వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చే సరికి కుమార్తె ఈరమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటనపై తల్లి దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొల్లంపల్లి గ్రామంలో వ్యక్తి..

వెల్దండ, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కానుగుల జంగయ్య (40) అనే వ్యక్తి వెల్దండలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. అతడు బుధవారం సాయంత్రం తన పొలంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి జారి పడి యువకుడి మృతి

పెబ్బేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌పై నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందాడు. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్‌లో బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పగుడాల భరత్ (29) అనే యువకుడు గ్రామ సమీపంలో పెద్దగుట్ట వాగు వద్ద ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని గ్రామానికి బయలుదేరాడు. అతడు ట్రాక్టర్ నడుపుతుండగా, తల్లి లక్ష్మి, తమ్ముడు శేఖర్ ట్రాలీలో కూర్చున్నారు. వాగు నుంచి రోడ్డుపైకి వస్తుండగా ట్రాక్టర్ ఇంజన్ టైర్ ఓ పెద్ద రాయి మీదకు ఎక్కింది. దీంతో భరత్ పై నుంచి జారి కింద పడ్డాడు. అతడి మీదుగా ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, కుమారుడు అజయ్, కుమార్తె రజిత ఉన్నారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని రెండవ ఎస్ఐ దివ్య తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇటీవల కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో జడ్చర్లకు చెందిన మహమ్మద్ ఖాదర్‌పాషా, కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్‌కు చెందిన బాలకృష్ణగౌడు పట్టుబడ్డారు. పోలీసులు వారిని అరెస్టు చేసి బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. మహమ్మద్‌ఖాదర్‌పాషకు ఒక రోజు జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా, బాలకృష్ణగౌడ్‌కు ఒక రోజు జైలు శిక్ష, రూ. 600 జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ట్రక్కు బోల్తా

భూత్పూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఓ ట్రక్కు టైర్ పగిలిపోవడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటన బుధవారం 44వ నెంబర్ జాతీయ రహదారిపైనున్న భూత్పూర్ ఫ్లైఓవర్‌పై జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని అసన్ ప్రాంతం నుంచి అల్లం లోడుతో హైదరాబాద్‌కు వెళ్తోంది. భూత్పూర్ హైవే మీద ఫ్లైఓవర్ బ్రిడ్జి మీకు రాగానే ట్రక్కు వెనుకనున్న టైర్ పగిలిపోయింది. దీంతో అది అదుపు తప్పి, కుడివైపున ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లు హరీశ్, ఆదిత్యలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న ట్రక్కును పక్కకు తొలగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


స్వామి (ఫైల్)

కోడేరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని తీగలపల్లిలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాచూరి స్వామి (45) బుధవారం తన పొలంలో మోటారు ఆన్ చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, స్వామి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తన ప్లాట్‌ను వేరొకరు ఆక్రమించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో జరిగింది. బాధితుడు పుల్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని టంగాపూర్ శివారులోని 26, 27 సర్వే నెంబర్ల భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఎలికంటి లింగయ్య అనే వ్యక్తి ద్వారా పుల్య కూడా అక్కడ ప్లాటు కొనుక్కొని ఓ రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. అయితే ఈ ప్లాటు తమదని చెప్తూ, కొందరు బుధవారం ఆ షెడ్డును కూల్చేశారు. దీంతో మనస్తాపం చెందిన పుల్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎండు గంజాయి స్వాధీనం


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

జడ్చర్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనకు సంబంధించి ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన కుమార్ అలియాస్ మింటు, బిహార్ రాష్ట్రానికి చెందిన బిజేష్‌కుమార్ మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. కొత్త బస్టాండ్ సమీపంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు వారిని ఆపి, సోదా చేయగా 310 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. వీరిరువురు హైదరాబాద్‌లో అర కిలో గంజాయిని రూ.15 వేలకు కొనుగోలు చేసి, 10 గ్రాముల చొప్పున ప్యాకెట్లు తయారు చేసి విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. కుమార్ పోలేపల్లి సెజ్‌లోని హెటిరో ఫార్మా కంపెనీలో, బిజేష్ కుమార్ సెజ్‌లోని ఓ పరిశ్రమలో కూలీగా పని చేస్తున్నట్లు చెప్పారు. వారి నుంచి గంజాయితో పాటు బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలి పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌రెడ్డి, కానిస్టేబుళ్లు అనిల్, సిద్ధు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని 12 గొర్రెల మృతి

శ్రీరంగాపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బొలెరో వాహనం ఢీకొని 12 గొర్రెలు చనిపోయాయి. వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండలంలోని కంభాళపురం సమీపంలో బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన ఎరుకలి శంకరయ్య గొర్రెల మందను మేపుకొని, ఇంటికి తీసుకొస్తుండగా బొలెరో వాహనం వాటిని ఢీకొన్నది. దీంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 4 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి.

కుటుంబ పోషణ భారం

4 నెలలుగా అందని గౌరవ వేతనం

- ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- 9 నెలలుగా మంజూరు కాని గుడ్ల బిల్లులు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 6 వేల మంది కార్మికులు


అమరచింతలో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న కార్మికులు (ఫైల్)

అమరచింత, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పనికి తగిన వేతనాలు లేక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వంట పనివారు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్యాశాఖ నిర్ణయించిన మెనూ ప్రకారం వంటలు చేసి, సకాలంలో విద్యార్థుల ఆకలి తీరుస్తున్న వీరికి ఇస్తున్న వేతనాలు ఎంత మాత్రమూ సరిపోవడం లేదు. ఇచ్చే అంతంత మాత్రం వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోవడం సమస్యగా మారింది. వంట సామగ్రికి సంబంధించిన బిల్లులను కూడా ప్రభుత్వం ప్రతీ నెల విడుదల చేయడం లేదు. ఐదు, ఆరు నెలలకోసారి ఇస్తుండటంతో సరుకులు తేవడం కష్టమవుతోంది. ఒక్కో సారి అప్పు చేసి ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

వనపర్తి జిల్లాలో 1200 మంది కార్మికులు

మధ్యాహ్న భోజన పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 6 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. అందులో వనపర్తి జిల్లాలో 1,200 మంది వరకు కార్మికులున్నారు. కొన్ని పాఠశాలల్లో వంట గదులు అసంపూర్తిగా ఉన్నాయి. మరి కొన్ని బడుల్లో వంట గదులే లేక ఆరు బయటే వంటలు చేయాల్సి వస్తోంది. వంట చేసేందుకు అవసరమైన సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో కట్టెల పొయ్యి మీదనే వండాల్సి వస్తోంది. కట్టెల పొయ్యి వల్ల వచ్చే పొగతో శ్వాసకోశ వ్యాధులు, కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అయినా వారికి ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించడం లేదు.

పెండింగ్‌లో వేతనాలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 4 నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయడం లేదు. ఇచ్చే రూ. 3 వేల రూపాయలు కూడా ప్రతీ నెల ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారం అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గౌరవ వేతనం కూడా సక్రమంగా ఇవ్వకపోవడంపై అసంతృప్తి చెందుతున్నారు. దీనికి తోడు కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు కూడా 9 నెలలుగా మంజూరు కావడం లేదు. మెనూ ప్రకారం విద్యార్థులకు గుడ్లు తప్పని సరిగా ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో అప్పు చేసి గుడ్లు కొనుగోలు చేసి ఇస్తున్నట్లు వారు చెప్తున్నారు. ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో మధ్యాహ్నభోజన కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. గౌరవవేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని, ప్రతీ నెల బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

బిల్లులు అందక అవస్థలు



దేవమ్మ, వంట కార్మికురాలు, అమరచింత : గౌరవ వేతనం 4 నెలలుగా అందడం లేదు. గుడ్డు బిల్లులు 9 నెలలుగా రాలేదు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం చెప్తున్నా, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించి మమ్మల్ని ఆదుకోవాలి.

గౌరవ వేతనం పెంచాలి



ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి, ప్రగతి శీల మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలి. హామీ ఇచ్చి 2 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అమలు కాలేదు. కార్మికులకు రూ. 10 లక్షల బీమా సదుపాయం కల్పించాలి.

శిక్షణతో ఉపాధి అవకాశాలు


వృత్తి నైపుణ్య శిక్షణ పొంది, పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

- డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవ కాశాలు లభిస్తాయని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన 150 మంది అభ్యర్థులకు బుధవారం డీఈవో పాత కార్యాలయంలో పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాన్ని డీవైఎస్‌వో తనిఖీ చేసి మాట్లాడారు. నిరుద్యోగ యువతీ, యువకులకు బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జర్దోసీ, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌస్‌వైరింగ్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 17 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయ్యిందని, 18వ విడత శిక్షణ ప్రారంభమైందని చెప్పారు. పరీక్ష రాసిన వారికి ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు. అనంతరం జాబ్‌మేళా ఏర్పాటు చేసి, ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెట్విన్ కోఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, ఎగ్జామినర్లు మహ్మద్ షేక్ ఇస్మాయిల్, అజీమ్, ఎజాజ్, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి, సిబ్బంది హరిప్రసాద్, కౌసల్య, సువర్ణ, ఖలీల్, ఇమ్రాన్, అజహర్ పాల్గొన్నారు.

పీయూ స్నాతకోత్సవానికి ఆహ్వానం


మన్నె సత్యనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు కావాలని ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఛైర్మన్, ఎండీ మన్నె సత్యనారాయణను వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ ఆహ్వానించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబుతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. వచ్చే నెల 16న నిర్వహించనున్న పీయూ నాలుగవ స్నాతకోత్సవానికి హాజరు కావాలని కోరారు. యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, విద్యాబోధన, కొత్త కోర్సులు, బడ్జెట్, వసతులు తదితర అంశాలపై ఆయనతో చర్చించారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

- ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా, ముక్‌పాల్‌లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్లకు జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ 18 మంది బాలురు, 18 మంది బాలికలు, మొత్తం 36 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ప్రతిభ చూపిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రాణ త్యాగాలతో తెలంగాణ విముక్తి


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న డీకే అరుణ, నాయకులు

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విముక్తి కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను మరిచిపోలేనివని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో గత 11 సంవత్సరాలుగా ముందుకు సాగుతున్నారన్నారు. ముచ్చటగా మూడవ సారి ప్రధాని అయిన మోదీ, ప్రపంచ దేశాలతో సఖ్యతగా మెలుగుతూ భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్నారని కొనియాడారు. అనంతరం పట్టణంలోని కొత్తగంజి, భగీరథకాలనీల్లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను ఆమె ప్రారంభించారు. బీజేపీ నాయకుడు దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజా రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్‌రెడ్డి, రమేశ్, కార్యవర్గ సభ్యులు కొండా బుచ్చారెడ్డి, నాయకులు పడాకుల బాల్‌రాజ్, పాండురంగారెడ్డి, అంజయ్య, రామాంజనేయులు, పెద్ద నర్సింహులు, పి.రాజేందర్‌రెడ్డి, యాదయ్య, వీరన్న, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీశైలం యాదవ్, హరికృష్ణ పాల్గొన్నారు. .

శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో

వేగంగా మరమ్మతులు

- నాలుగో యూనిట్‌లో రోటార్ బిగింపు
- వచ్చే నెల మొదటి వారానికి పూర్తి చేసేందుకు కసరత్తు


రోటార్‌ను క్రేన్ సహాయంతో తరలిస్తున్న దృశ్యం

బ్రహ్మగిరి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాల క్రితం 2020 ఆగస్టు 20న షాట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైన శ్రీశైలం ఎడమగట్టు నాలుగో యూనిట్ మరమ్మతులు అక్టోబరు మొదటి వారం వరకు పూర్తి చేసేందుకు జెన్‌కో అధికారులు, వాయిత్ కంపెనీ సిబ్బంది కృషి చేస్తున్నారు. బుధవారం నాలుగో యూనిట్ స్టేటార్‌లో రోటార్‌ను బిగించారు. (రోటార్ లోవరింగ్) అగ్ని ప్రమాదం జరిగిన మూడు సంవత్సరాలకు 2023లో మరోసాగి నాలుగో యూనిట్‌ను ప్రారంభించినా మూడు వారాలలోపే సాంకేతిక లోపంతో స్టేటార్‌లో షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వైండింగ్ బార్స్ కాలిపోయి సమస్య మొదటికి వచ్చింది. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నాలుగో యూనిట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గత సంవత్సరం మరోసారి జెన్‌కో యాజమాన్యం నిధులను కేటాయించింది. దీంతో నాలుగో యూనిట్ పనులు చేసేందుకు వాయిత్ కంపెనీ పనులు ప్రారంభించింది.

రోటార్ బిగింపు పనులు

నాలుగవ యూనిట్‌ను ఈ ఏడాది వినియోగంలోకి తెచ్చేందుకు జెన్‌కో యాజమాన్యం సంవత్సరం కాలం పాటు శ్రమించి ఎట్టకేలకు స్టేటార్‌లో రోటార్‌ను బిగించారు. ఆప్పటికే స్టేటార్ వైండింగ్ టెస్టు చేశారు. ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు రోటార్ అప్పర్ బ్రాకెట్, అప్పర్ గైడ్ బేరింగ్ (యూజీసీ), టాప్ ఎండ్ బెల్‌కవర్స్, చక్కర్ ప్లేట్స్, మరికొన్ని సాంకేతికమైన పనులు పూర్తి చేసి అక్టోబరు మొదటి వారంలో నాలుగో యూనిట్‌ను పరీక్షించి, అన్నీ సవ్యంగా జరిగితే విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు జెన్‌కో యాజమాన్యం కృషి చేస్తోందని జెన్‌కో ఇంజనీర్లు తెలిపారు.

జాతీయ సమైక్యతకు కట్టుబడి విలీనం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యతకు కట్టుబడి అప్పటి నిజాం నవాబు హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా కాకుండా, జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకోవాలని కోరారు. వనపర్తి పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ నిజాం నవాబు ప్రజా సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కోయిల్‌సాగర్, పాత రామన్‌పాడు, డిండి, నిజాం సాగర్ వంటి ప్రాజెక్టులను నిర్మించారని గుర్తు చేశారు. నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం ఉధృతంగా సాగిందని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో జాతీయ సమైక్యత కోసం 1948, సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేశారని చెప్పారు. కానీ కొంత మంది నిజాంపై విష ప్రచారం చేస్తూ విమోచనదినంగా జరుపుకుంటున్నారని విమర్శించారు. ఆనాటి నెహ్రూ ప్రభుత్వం నిజాం నవాబును రాజ్ ప్రముఖ్‌గా నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధిపై నిజాం నవాబుకున్న చిత్తశుద్ధి నేటి పాలకులలో లేదని ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి త్వరలోనే ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేశ్‌గౌడ్, నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, సూర్యవంశం గిరి, హేమంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక టిప్పర్ల పట్టివేత

మరికల్/ మద్దూరు/ కోస్గి రూరల్/ చిన్నచింతకుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో వేర్వేరు చోట్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 4 ఇసుక టిప్పర్లను టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి మరికల్ మండల పరిధిలోని రాకొండ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్న 2 ఇసుక టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేశారు. అను మతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు మరికల్ 2వ ఎస్ఐ మహేశ్వరి తెలిపారు.

- మద్దూరు మండల పరిధిలోని సూరారం వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను కొత్తపల్లి శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. యజమాని తిరుపతిరెడ్డి, డ్రైవర్ నరేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.
- కోస్గి మండలంలోని లింగాల్‌చేడ్ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండల కేంద్రం శివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు రెండవ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.
- మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని మద్దూరు శివారులోని 250 సర్వేనెంబర్‌లోని భూమిలో అక్రమంగా నిల్వ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుక డంపును బుధవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఎల్లయ్య తెలిపారు.

ఇంటర్వ్యూ..

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు

- చంద్రశేఖర్‌రావు, మునిసిపల్ కమిషనర్, కొల్లాపూర్



కొల్లాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులను గుర్తిస్తున్నామని కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో వెల్లడించారు.

కొల్లాపూర్ మునిసిపాలిటీకి ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని కేటాయించారు ?

కొల్లాపూర్ మునిసిపాలిటీలోని అన్ని వార్డులకు 416 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.250ఇళ్లకు ప్రొసీడింగ్‌లు వచ్చాయి. 120 మంది ఇళ్లకు వర్కౌట్ చేశాము. 50ఇళ్లకు పనులు కొనసాగుతున్నాయి.

మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ఏమి చర్యలు చేపట్టారు?

కొల్లాపూర్ మునిసిపాలిటీలో ప్రధాన రోడ్ల వెంబడి ప్రతీరోజు పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. వార్డుల్లో రోజువిడిచి రోజు సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. అప్పటికప్పుడు ప్రజల అవసరార్థం పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం.

మునిసిపాలిటీలో కుక్కల బెడద నివారణకు చర్యలు ఎలా ?

కొల్లాపూర్ మునిసిపల్‌లో వీధి కుక్కలు పెరిగాయని, వాటి వల్ల ప్రమాదం పొంచి ఉందని తమ దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని నివారించేలా చర్యలు చేపడతాం. అదే విధంగా రోడ్లపై ఆవులు, మేకలు రాకుండా రోడ్లపై పెట్టిన మొక్కలను అవి తినకుండా వాటిని రోడ్లపైకి వదలకుండా వాటి యజమానులకు అవగాహన కల్పిస్తాం. రోడ్లపై మూగజీవాలు సంచరిస్తూ పట్టణ ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు పెట్టకుండా నివారణ చర్యలు చేపడతాం.

న్యూస్ బాక్స్

చికెన్ కర్రీలో బల్లి

- కొల్లాపూర్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో వెలుగు చూసిన ఘటన

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చికెన్ కర్రీలో బల్లి పడిన ఘటన బుధవారం మధ్యాహ్నం నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తావద్ద ఓ హోటల్‌లో వెలుగులోకి వచ్చింది. చికెన్ కర్రీ ఆర్డర్ ఇచ్చిన నలుగురు మిత్రులకు కర్రీలో బల్లి ప్రత్యక్షం కావడంతో హోటల్ యజమానిని నిలదీసినట్లు సమాచారం. కాళ్లవేళ్లా పడి బతిమాలిన హోటల్ యజమాని సంఘటన బయటకు రాకుండా మేనేజ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ అంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ, కొల్లాపూర్ చౌరస్తాల వద్ద వెలిసిన దాబాల్లో శుభ్రత పాటించడం లేదని నాణ్యమైన భోజనం అందించడం లేదని మునిసిపల్ అధికారులకు అనేక ఫిర్యాదులు వస్తున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్పందించకపోవడం తీవ్రమైన విమర్శలకు దారి తీస్తోంది.

ఓపీఎస్ అమలు చేయాలి

- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు

తిమ్మాజిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ (ఓపీఎస్) విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, గొరిట, తిమ్మాజిపేట జడ్పీహెచ్‌ఎస్‌లలో గుమ్మకొండ, కొడుపర్తి ప్రాథమికోన్నత పాఠశాలల్లోను ఉపాధ్యాయులచే మండల ఎస్టీయూ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డితో కలిసి సభ్యత్వాలు చేయించారు. ఎస్టీయూ సభ్యులు వెంకటస్వామి, కార్తీక్, అమరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జెండాలు కట్టడంపై నిరసన

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ బీజేపీ జెండాలు కట్టడాన్ని నిరసిస్తూ బుధవారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ జెండా తోరణాలు కట్టడం చాలా దారుణమని అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మన్ననూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర బాల స్వస్థ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ మంగ, డాక్టర్ మహేశ్వర్‌ల ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీటీడబ్ల్యూహెచ్‌ఎస్ హెచ్‌ఎం సిద్ధార్థ మహదేవ్, ఏఎన్‌ఎం రేణమ్మ, ఫార్మాసిస్టు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీటీసీపీ లేఅవుట్‌కు అనుమతి తప్పనిసరి : కమిషనర్

కల్వకుర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డీటీసీపీ లే అవుట్‌కు అనుమతి వచ్చిన తర్వాతే ప్లాట్ల విక్రయాలు జరగాలని, లేకుంటే చర్యలు తప్పవని కల్వకుర్తి మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ హెచ్చరించారు. ఖాళీ స్థలాలను వేరే వ్యక్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుంటే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కల్వకుర్తి పట్టణంలో బుధవారం పలు డీటీసీపీ లేఅవుట్లను ఆయన పరిశీలించారు. కొంతమంది డీటీసీపీ లే అవుట్ చేసిన వారు ఫైనల్ అప్రూవర్ తీసుకోకుండానే ప్లాట్లను విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ సిబ్బంది శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితోనే

ప్రజాపాలన దినోత్సవం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట/ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితోనే ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న రాచరికపాలన ముగిసి తెలంగాణలో ప్రజాస్వామిక పాలన శకం ఆరంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకు ప్రజాపాలన

కల్వకుర్తి : తెలంగాణలో ప్రజాభీష్టం మేరకే ప్రజాపాలన కొనసాగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై ఎమ్మెల్యే జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శివరాం, పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ షేక్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సైరెడ్డి వెంకటరెడ్డి, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ బి.నాగార్జున, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకట్రాములు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి

కొల్లాపూర్ : బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ముందు నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. అందరి చేత స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ మునిసిపల్ మాజీ ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తాడూరు : ఎంపీడీవో కార్యాలయంపై ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ జయంతి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గురుస్వామితో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేశారు.

● తెలకపల్లి : తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీవో శ్రీనివాసులు వారి కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

● లింగాల : తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్‌లు వారి కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేశారు.

● అమ్రాబాద్ : ఎంపీడీవో లింగయ్య, తహసీల్దార్ శైలేంద్రకుమార్, సీఐ శంకర్‌నాయక్ వారి వారి కార్యాలయాలపైన జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.

● చారకొండ : తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శంకర్ నాయక్, పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, పీహెచ్‌సీలో డాక్టర్ మంజుభార్గవి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ శంషుద్దీన్ జాతీయ జెండాను ఎగుర వేశారు.

● ఊర్కొండ : మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణయ్య, నయాబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ కృష్ణదేవ వారి వారి కార్యాలయాలపై జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి భీముడు నాయక్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పెర్మల వెంకటేశ్వర్లు, రాజారాం, సంభు వెంకట్‌రమణ, గోపాల్, శంకర్, జూలూరి సత్యనారాయణ, శివాజి , వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే మన్ననూరులో ఆర్యసమాజ్ కార్యకర్తల ఆధ్వర్యంలో పండిత్ నరేంద్రజీ స్మారక భవనం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యకర్తలు శేఖర్, ప్రసాద్, తిరుమలేష్, పర్వతాలు పాల్గొన్నారు.

● వెల్దండ : తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగరవేశారు.



అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో జాతీయజెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



కొల్లాపూర్ మునిసిపల్ కార్యాలయం దగ్గర స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపైన జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

చరిత్ర చిరస్మరణీయం

- భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి



నాగర్‌కర్నూల్‌లో విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న విశ్వబ్రాహ్మణులు

నాగర్‌కర్నూల్‌టౌన్/ లింగాల/ పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి/ చారకొండ/ బిజినేపల్లి/ వెల్దండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బుధవారం జిల్లాలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనంలో స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్‌కాలనీ బ్రహ్మంగారి దేవాలయంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ పూజల అనంతరం కేరళ వాయిద్య బృందం, మహిళల కోలాటాలు, భజనలతో శోభాయాత్ర వైభవంగా సాగింది. లింగాలలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు మురళీచారి మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర చిరస్మరణీయమని అన్నారు. పెద్దకొత్తపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మహేష్‌చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలకపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కే ప్రశాంత్ విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. చారకొండలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నారోజు నరసింహాచారి విశ్వకర్మ భగవాన్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శంషుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలరాంగౌడ్, పీఏసీ ఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్ ఉన్నారు. బిజినేపల్లిలో విశ్వబ్రాహ్మణుల సంఘం సభ్యులు శ్రీకాంతాచారి, ప్రవీణ్‌చారి, ప్రభాకరాచారి, శ్రీనివాసచారి, శేఖరాచారి విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వెల్దండలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. నాయకులు వెంకటయ్యగౌడ్, కృష్ణయ్య, రామకృష్ణ, పురుషోత్తమాచారి, కృష్ణయ్య, సంతోష్‌చారి, జంగాచారి, పాండుచారి పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి



జిల్లా జనరల్ ఆసుపత్రిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, కలెక్టర్, ఎస్పీలు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుంటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా జనరల్ ఆసుపత్రిలో స్వస్థ్‌నారీ సశక్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వం శీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లతో కలిసి రాష్ట్ర ప్రణాళిక సం ఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, గ్రామాల్లో నేటితో ప్రారంభమైన ఆరోగ్య శిబిరాలు అక్టోబరు 2 వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మ న్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణా రావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, జిల్లా వైద్యాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

కందనూలు : ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్‌నాయక్ పిలుపునిచ్చారు. స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, ఎన్‌హెచ్‌ఎం డీపీవో రేణయ్య, డిప్యూటీ డెమో గోపాలచారి, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రమేష్‌రెడ్డి, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ రమేష్‌రెడ్డి, యూత్‌రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షణాధికారులు, బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి రెడ్ క్రాస్ సభ్యులు కృష్ణారావు, శ్రీనివాసులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

వంగూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని రంగాపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను తహసీల్దార్ మురళీమోహన్‌తో పాటు ఎంపీడీవో బ్రహ్మచారి, ఎంఈవో మురళీమోహనాచారి ప్రారంభించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు క్యామ మల్లయ్య మాట్లాడుతూ క్రీడలు యువతలో ఆరోగ్యం, క్రమ శిక్షణ, స్ఫూర్తి, ఐక్యతను పెంపొందిస్తా యన్నారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో తెలంగాణ విమోచన దినం సందర్భంగా తహసీల్దార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

క్రీడలతోనే బంగారు భవిష్యత్తు

లింగాల : గ్రామీణ క్రీడలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని ఎంఈవో బషీర్ అహ్మద్ అన్నారు. బుధవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 విభాగంలో మండల స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించారు. అంతకు ముందు క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు.

నైపుణ్యం కనబరచిన వారినే ఎంపిక చేస్తాం

ఊర్కొండ : క్రీడల్లో నైపుణ్యం కనబరచిన విద్యార్థులనే ఎంపిక చేస్తారని ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లలో మండలంలోని పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికవ్వాలని విద్యార్థులకు సూచించారు. మండ లంలోని పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి మన ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రహీం, పీడీ జగన్, గ్రామస్థులు వహీద్, బాలరాజు ఉన్నారు.

విమోచన దినం నిర్వహించాలి

- విమోచన దినం పేరుతో జాతీయ జెండావిష్కరణ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు

-ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని కేక్ కటింగ్, రక్తదాన శిబిరాలు



నాగర్‌కర్నూల్‌లో జాతీయ జెండావిష్కరణలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, నాయకులు

కందనూలు/నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు చోట్ల తెలంగాణ విమోచన దినంపేరుతో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ పతాకావి ష్కరణ చేశారు. ఇదే రోజు భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం ఉన్నందున కేక్‌లు కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అక్కడక్కడా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం వద్ద తెలంగాణ విమోచన దినం పేరుతో జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్‌చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుసిరెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, పోల్దాసు రాము, బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు నాగేందర్‌గౌడ్, రాజు, శేఖర్, పవన్, శివ, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ● ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్‌కుమార్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు పాల్గొన్నారు.

మోదీ పాలన ప్రపంచానికి ఆదర్శం : ఎల్లేని

కొల్లాపూర్ : భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలన ప్రపంచా నికే ఆదర్శంగా నిలిచిందని బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. బుధవారం మోదీ 75వ జన్మదిన వేడుకలను కొ ల్లాపూర్‌లో ఎల్లేని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం లోటస్ మన్షన్ ఫంక్షన్ హాల్లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌చంద్ర ఆధ్వర్యంలో మెగావైద్య శిబిరం నిర్వహించారు. సుధాకర్‌రావు రక్తదానం చేశారు. అంతకుముందు బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ముందు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎల్లేని ఆవిష్కరించారు. మెగా రక్తదాన శిబిరంలో నరేంద్రమోదీ అభిమానులు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎ త్తున పాల్గొని రక్తదానం చేశారు. దారా సింగ్, సందు రమేష్, తమటం శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రక్తదానం చేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

● కల్వకుర్తి : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో డాక్టర్ రమ్యా, బీజేపీ సీనియర్ నాయకులు బండెల రామ చంద్రారెడ్డి, దుర్గాప్రసాద్, బాబీదేవ్, నరసింహ, రాంభూపాల్‌రెడ్డి, నరేష్ గౌడ్, కృష్ణగౌడ్, రాఘ వేందర్‌గౌడ్, రవిగౌడ్, అంజన్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, చందు ఉన్నారు. అదేవి ధంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు బాబీదేవ్ జెండాను ఆవిష్కరించారు.

● ఊర్కొండ : ప్రధాని మోదీ పుట్టినరోజు పురస్కరించుకొని మండలంలోని మాదారం సీతారామాంజనేయ స్వామివారి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కేకు కట్ చేశారు. అక్కడే పాఠశాల విద్యా ర్థులకు జామెట్రి బాక్సులను అందజేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, నాయకులు నరేందర్‌గౌడ్, అరవింద్‌గౌడ్, తాడెం చిన్నా, దివాకర్‌గౌడ్, తిరుపతిరెడ్డి ఉన్నారు.

● వెల్దండ : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని వెల్దండ, కొట్ర గ్రామాలలో బీజేపీ నాయకులు కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, తాటికొండ కృష్ణారెడ్డి, జూలూరి బాలస్వామి, గుడ్డటి రామస్వామి, దేవేందర్, మోహన్‌రెడ్డి, సంతోష్ ఉన్నారు.

చిన్నారుల్లో అక్షరాస్యత సామర్థ్యాలను పెంపొందించాలి

మన్ననూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అక్షరాస్యతా సామర్థ్యాలను పెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టి సారించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ కమల అన్నారు. మన్ననూరు గ్రామంలో పోషణ్‌బీ పదాయిబీ శిక్షణ తరగతుల్లో రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం శిక్షణ తరగతులు కొనసాగాయి. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పద్మ, సువర్ణ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విలీన దినోత్సవం



జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ సమైక్యత పేరుతో విలీన దినోత్సవాలను నిర్వహించారు. నెల్లికొండ శివారులోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ బిడ్డలు అడుగుపెట్టిన రోజును విలీనం, విమోచనం పేరుతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో మరోసారి సంక్షేమం, అభివృద్ధి, ప్రజాస్వామిక రాజ్యం కోసం కేసీఆర్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మాదవరం హనుమంతరావు, మాజీ ఎంపీపీలు నరసింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీశైలం, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ బాబురావు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరించడం సరికాదు

- తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు



నాగర్‌కర్నూల్‌లో జెండావిష్కరణలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణంలోని బస్టాండు ఎదురుగా సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బీజేపీ హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేందుకు విలీన దినాన్ని విమోచనంగా పాటిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, కె గీత, నాయకులు రామయ్య, అశోక్, యాదయ్య, వెంకటేష్, అంతటి కాశన్న, సత్యనారాయణ, రవి, మల్లికార్జున్, రాఘవేందర్, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి, రవికిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ నాటి పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తాం

అచ్చంపేట రూరల్ : తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యనాయక్‌అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పుచ్చలపల్లి సుందరయ్య, రంగమ్మల నాయకత్వంలో పని చేసి మరణించిన కామ్రేడ్‌లు అచ్చంపేట మండలం చెంచు పలుగుతండా గ్రామానికి చెందిన తార్యానాయక్, లక్మాపూర్ గ్రామానికి చెందిన కాశన్న స్తూపాలకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎం.శంకర్ నాయక్, నాగరాజు, మల్లేష్, మండల కార్యదర్శి వి.సైదులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వారోత్సవాలు

కల్వకుర్తి : సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయం ముందు ఆ పార్టీ జెండాను నాయకులు అంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏపీ మల్లయ్య, పరశురాములు, బాలస్వామి, నిరంజన్, రఘుపతి, శ్రీనివాసులు ఉన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

వంగూరు : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మండలం కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జెండాను పార్టీ జిల్లా నాయకుడు చింత అంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాలస్వామి, శివరాములు, భీమరాజు, రాములు, బాలయ్య, సూల్తాన్, శ్రీను, రామస్వామి పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి ఏడుకోట్లు స్వాహా

- గ్రోల్యాండ్ కంపెనీ పేరుతో అండమాన్‌కు చెందినవారి మోసం

- నలుగురు నిందితుల అరెస్టు, రిమాండ్

నాగర్‌కర్నూల్‌క్రైం, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ ఆశచూపి దాదాపుఏడు కోట్లు దండుకొని పరారైన దుండగులను పట్టుకొని రిమాండ్ చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు ఆర్మీ కొండ్రాళ్ల మాసయ్యకు హైదరాబాద్‌లో అండమాన్‌కు చెందిన వ్యక్తులు ఆర్.రోహన్, టి.ఆది, రాము, టి.అలీలు పరిచయమయ్యారు. గ్రోల్యాండ్ కంపెనీలో పెట్టుబడి పెడితే 25శాతం లాభం వస్తుందని మాయమాటలు చెప్పి నమ్మించారు. కొండ్రాళ్ల మాసయ్యతో పాటు మరో 50 మందితో సుమారు రూ. 7 కోట్లు కంపెనీలో డిపాజిట్ చేయించి పరారయ్యారు. ఈ సంఘటనపై కొండ్రాళ్ల మాసయ్య 2025 మార్చి 7వ తేదీన నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రత్యేక పోలీసు బృందాన్ని డెహ్రాడూన్‌కు పంపించి నలుగురు నిందితులను అక్కడ పట్టుకొనివచ్చి మంగళవారం రాత్రి నాగర్‌కర్నూల్ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. వారిని కస్టడీలోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని సీఐ తెలిపారు.